

అటు వ్యాధి.. ఇటు వేదన

కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతూ డయాలసిస్ అవసరమైన ఎయిడ్స్ బాధితులకు ఖమ్మం పెద్దాస్పత్రిలో సేవలు అందడం లేదు. 8లో



సారూ.. కనికరించరూ

పోలీసు ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమను కూడా రెగ్యులర్ చేయాలని హోంగార్డులు కోరుతున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 24°

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

'అన్నం'కు కాకతీయ వైభవ కీర్తి పురస్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న సాహితీ వేదిక బాధ్యులు

ఖమ్మంఅర్బన్: అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలకు గాను కాకతీయ వైభవ కీర్తి పురస్కారం దక్కింది. 76వ స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా, పుడమి సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హన్మకొండలో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో శ్రీనివాసరావు ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాలరెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి 'గాంధీ' ప్రదర్శన

డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మం సహకారనగర్ : భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఈనెల 14 నుంచి 24 వరకు సినిమా థియేటర్లలో జాతిపిత మహాత్మాగాంధీ చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. గాంధీ జీవిత చరిత్రను తెలుసుకునేందుకు విద్యార్థులకు మాత్రమే కాకుండా తల్లిదండ్రులు, సాధారణ ప్రజలు కూడా వీక్షించేలా థియేటర్లలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రాన్ని ప్రదర్శించాలని సూచించారు. 14వ తేదీ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, 15న స్వాతంత్య్ర దినోత్సవం, 20న ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదని తెలిపారు. ఈనెల 16నుంచి 24వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, జిల్లాలోని సినిమా థియేటర్ల నిర్వాహకులు ఎలాంటి ఆటంకాలు లేకుండా గాంధీ చలన చిత్ర ప్రదర్శన చేయాలని సూచించారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. పూజా కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు

నేడు రుద్రహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఊరూవాడ జోరుగా మొక్కల పండుగ

- హరితహారం లక్ష్యసాధనలో నిమగ్నమైన ప్రభుత్వ శాఖలు
- 9వ విడత లక్ష్యం.. 32.48 లక్షల మొక్కలు
- ఇప్పటికే 85 శాతానికి పైగా పూర్తి

హరిత శోభ!



ఖమ్మం అర్బన్ మండలం టేకులపల్లిలో అటవీ శాఖ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో మొక్కల పండుగ ఉత్సాహంగా సాగుతోంది. గత నెలలో భారీ వర్షాలు కురవడంతో హరితహారం కార్యక్రమాన్ని అధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 9వ విడతలో జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల ఆధ్వర్యాన 32.48 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటికే 27,78, 400 మొక్కలు నాటి 85.54 శాతం మేర లక్ష్యాన్ని పూర్తిచేశారు. గతంలో నాటగా చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటడంతో పాటు ఖాళీ, ప్రభుత్వ స్థలాలు, రోడ్ల వెంట విస్తృతంగా మొక్కలు వేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పూర్తయిన లక్ష్యంలో నాటిన మొక్కల కంటే పంపిణీ చేసిన మొక్కలే ఎక్కువగా ఉండడం గమనార్హం.

రెట్టించిన ఉత్సాహంతో..

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవిష్యత్ తరాలకు ఇది మరింత సంకటంగా మారకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. గత ఎనిమిది విడతల్లో అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయడంతో విజయవంతం అవుతోంది. ఈ విడతలో కూడా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా హరితహారంలో నాటాలనుకునే మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేశారు. ఎక్కడైనా చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటేందుకు రంగంలోకి దిగారు. ఏటా పట్టణాలు, పల్లెల్లో మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్న అధికారులు.. ఈసారి కూడా ప్రత్యేక దృష్టి సారించారు. విద్యాసంస్థలు, వసతిగృహాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర పారిశ్రామిక కేంద్రాల ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతున్నారు.

నాటినవి తక్కువ.. పంపిణీ ఎక్కువ

జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసినవి 27,78,400 మొక్కలుగా అధికారులు చెబుతున్నారు. అయితే, వీటిలో 8,33,600 మొక్కలు నాటగా.. 19,44,800 మొక్కలు ఇంకా నాటాల్సి ఉంది. నాటిన మొక్కల కంటే పంపిణీ చేసిన మొక్కలు చాలా ఎక్కువగా ఉండడం గమనార్హం. గృహాలకు, సంస్థలకు ఆయా శాఖలు పంపిణీ చేస్తున్నట్లు చెబుతున్నా.. వాటిని నాటారా, సంరక్షిస్తున్నారా అనే అంశంపై అధికారుల వద్ద స్పష్టత లేదు. ఇకనైనా పంపిణీ చేసిన మొక్కలపై కూడా అధికారులు దృష్టి సారిస్తేనే హరితహారం లక్ష్యం నెరవేరుతుంది.

టాప్‌లో డీఆర్‌డీఏ

జిల్లాలో మొత్తం 11 శాఖలకు మొక్కలు నాటడం, పంపిణీ బాధ్యతను అప్పగించారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యాన లక్ష్యానికి మించి మొక్కలు నాటడం, పంపిణీ చేయడం పూర్తి చేశారు. ఈ శాఖ ద్వారా ఇప్పటి వరకు 3,88,400 మొక్కలు నాటడంతోపాటు 16,80,600 మొక్కల పంపిణీ పూర్తయింది. అంటే 200 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఇక అటవీ శాఖ ఇప్పటి వరకు 2 లక్షల మొక్కలను నాటగా, మున్సిపల్ శాఖ 42,400 మొక్కలను నాటడంతోపాటు 2,56,400 మొక్కలను పంపిణీ చేసి లక్ష్యంలో 62.50 శాతం పూర్తి చేసింది. ఉద్యానవన శాఖ 80,500 మొక్కలు, సింగరేణి సంస్థ 47 వేల మొక్కలను నాటగా.. జల వనరుల శాఖ ఒక్క మొక్క కూడా నాటలేదు.

వడివడిగా లక్ష్యం వైపు..

గత నెలలో విస్తారంగా వర్షాలు కురవడంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలో జూలై 19న వెలుగుమట్ల అర్బన్ అటవీ పార్కులో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే, తొలినాళ్లలో నత్తనడకన సాగినా.. నాలుగైదు రోజులుగా జోరందుకుంది. ఈ ఏడాది వెలుగుమట్ల అటవీ పార్కుతోపాటు ఖమ్మం, కారేపల్లి, సత్తుపల్లి, మధిర ప్రాంతాల్లో అటవీ శాఖ నర్సరీలను ఏర్పాటు చేయగా.. అక్కడి నుంచి అన్ని శాఖలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ నెలలోనూ వర్షాలు విస్తారంగా కురిస్తే ఖాళీ ప్రదేశాలతోపాటు రిజర్వు ఫారెస్ట్‌లో మరిన్ని మొక్కలు నాటాలనే లక్ష్యంతో ఉన్నారు.

శాఖల వారీగా నాటిన, పంపిణీ చేసిన మొక్కల వివరాలు..

శాఖ	నాటిన మొక్కలు	పంపిణీ	మొత్తం
వ్యవసాయ	38,000	-	38,000
విద్యాశాఖ	2,600	2,600	5,100
డీఆర్‌డీఏ	3,88,400	16,80,600	20,69,100
ఎక్సైజ్	1,900	2,200	4,100
అటవీ	2,11,200	-	2,11,200
ఉద్యానవన	80,500	-	80,500
పరిశ్రమలు	5,800	-	5,800
గనులు	15,300	-	15,300
మున్సిపాలిటీ	42,400	2,56,400	2,98,800
సింగరేణి	47,500	3000	50,500
మొత్తం	8,33,600	19,44,800	27,78,400



దిగొచ్చిన ధరలు!

- అందుబాటులోనే టమాట, పచ్చిమిర్చి
- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు





ఖమ్మంవ్యవసాయం: సామాన్య, మధ్య తరగతి వర్గాలకు భారంగా మారిన టమాట, పచ్చిమిర్చి ధరలు ఎట్టకేలకు దిగొచ్చాయి. కిలో రూ.200 వరకు చేరిన టమాట ధర ప్రస్తుతం రూ.58కి, కిలో రూ.120 వరకు పలికిన పచ్చిమిర్చి ధర రూ.50కి చేరింది. సాధారణంగా మే నెలలో కూరగాయల ధరలు కొంతమేర పెరుగుతాయి. తొలకరి వర్షాలు, మే నెలలో కురిసే అకాల వర్షాలతో జూన్‌లో తగ్గుముఖం పట్టడం ఆనవాయితీ. ఇక జూలై నుంచి ధరలు పూర్తిగా సాధారణ స్థితికి చేరుతాయి. కానీ ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి. కూరగాయల ధరలు తగ్గాల్సిన సమయంలో బాగా పెరిగాయి.

అనావృష్టి.. అతివృష్టి..

జూన్ మొదటి, రెండో వారాల్లో మొదలు కావాల్సిన వానలు ఈ ఏడాది ముఖం చాటేశాయి. వర్షాలు అనుకూలించకపోవటంతో జూన్‌లో ఆశించిన విధంగా కూరగాయల పంటల సాగు కాలేదు. ఇక జూలైలో కొంత మేరకు వర్షాలు అనుకూలించినా.. నెలాఖరుకు అధిక వర్షాలతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. తొలుత వర్షాలు లేక కూరగాయల ధరలు పెరగగా, ఆ తర్వాత అతివృష్టితో మరింతగా పైపైకి వెళ్లాయి. వర్షాలకు ఇక్కడ పంటలు దెబ్బతినగా వరదల కారణంగా వివిధ ప్రాంతాల నుంచి రవాణా కూడా నిలిచిపోయింది. వరదలు తగ్గాక కొద్ది రోజుల పాటు సామాన్య, మధ్య తరగతి వర్గాలు కొనలేని స్థితిలో కూరగాయల ధరలు మండాయి. అయితే, ఈనెల 10వ తేదీ నుంచి కొంత మేరకు తగ్గుతున్నాయి. రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో దూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి కావడం, స్థానికంగా కూడా పలు ప్రాంతాల్లో పంటలు చేతికందుతుండటంతో ధరలు తగ్గినట్లు చెబుతున్నారు. ఆదివారం రైతు బజార్లలో టమాట ధర కేజీ రూ.58గా పలకగా.. ఇతర మార్కెట్లలో రూ.65 వరకు, పచ్చిమిర్చి ధర రైతు బజార్లలో రూ.50.. ఇతర మార్కెట్లలో రూ.60 నుంచి 70 వరకు అమ్మారు. అలాగే, రూ.70 పలికిన బెండకాయల ధర రూ. 26కు చేరగా, రూ.80 పలికిన కాకరకాయ ధర రూ.50కి, రూ.40కి పైగా చేరిన దొండకాయ ధర రూ.30కి తగ్గింది.

జూన్, జూలై, ఆగస్టు నెలల్లో టమాట, పచ్చిమిర్చి ధరలు (కిలోకు రూ.లలో)

నెల / తేదీ	టమాట	పచ్చిమిర్చి
జూన్ 11	38	70
18	42	70
24	58	90
30	94	94
జూలై 1	106	86
8	100	100
31	166	100
ఆగస్టు 3	126	64
5	110	66
12	58	58
13	58	50

'గృహలక్ష్మి' గడువు మూడు రోజులేనా?

- ఇందిరమ్మ రాజ్యం రాగానే రూ.5 లక్షలు ఇస్తాం
- మాయలఫకీరు మాటలకు కాలం చెల్లే రోజులొచ్చాయ్
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి



అభివాదం చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: మద్యం టెండర్లకు 20 రోజులు గడువు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. పేదలకు లబ్ధి చేకూరే గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి మాత్రం మూడు రోజుల గడువే ఇవ్వడం ఏంటని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ చెబుతున్న బంగారు తెలంగాణ ఇదేనా అని ఎద్దేవా చేశారు. మండలంలోని వెంకటగిరిలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ఇదేందయ్యా చంద్రం.. మీ ప్రభుత్వానికి పేదల సంక్షేమం ముఖ్యమా, లేక ప్రజలను అనారోగ్యాల పాలు చేసే మద్యం దుకాణాలు ముఖ్యమా' అని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మాయల ఫకీరు మాటలకు కాలం చెల్లే రోజులు వచ్చాయని, భద్రాద్రి అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు ఇస్తానని చెప్పి ఇంతవరకు ఒక్క పైసా కూడా విడుదల చేయకుండా రాముడినే మోసం చేశారని విమర్శించారు. మరో 90 రోజుల్లో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, అప్పుడు ప్రతీ పేదవాడికి రూ.5 లక్షలతో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. వంటగ్యాస్ రూ.500కే అందిస్తామన్నారు. విద్యార్థుల కోసం అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రెనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. వృద్ధులకు ఆసరా పింఛన్ రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు స్థానిక రామాలయానికి వెళ్లిన పొంగులేటి.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, నాయకులు భైరు హరినాథబాబు, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, కొత్తా సీతారాములు, బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని స్వర్ణకుమారి, రామసహాయం మాధవీరెడ్డి, చావా శివరాకృష్ణ, కళ్లెం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టుల భర్తీ

నియామక పత్రాలు అందజేసిన అదనపు కలెక్టర్



నియామకపత్రం అందజేస్తున్న అభిలాష అభినవ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని 12 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకుల భర్తీకి అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో ఐడీఓసీలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, నియమ, నిబంధనల మేరకు పూర్తి పారదర్శకతతో పోస్టులు భర్తీ చేశామని చెప్పారు. అభ్యర్థుల దరఖాస్తు నుంచి నియామకపత్రాల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అంకితభావంతో పనిచేయాలని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో ప్రత్యేకమైందని అన్నారు. నియామక పత్రాలు పొందిన వారంతా వెంటనే విధుల్లో చేరాలని సూచించారు. డీఈఓ సోమశేఖర శర్మ మాట్లాడుతూ జిల్లాలోని 14 కేజీబీవీలకు గాను 12 విద్యాలయాల్లో సీఆర్టీ, పీజీ సీఆర్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తించామని, 5 సీఆర్టీ, 42 పీజీ సీఆర్టీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం రాత పరీక్ష నిర్వహించిందని చెప్పారు. కార్యక్రమంలో జీసీడీఓ కె.భూలక్ష్మి, సీఎంఓ వై.రాజశేఖర్, ఏపీఓ ఎస్.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్‌లు చావా శ్రీనివాసరావు, ఎస్.శ్రీధర్ బాబు, జి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ టీటీ టోర్నీకి ఎంపిక



శ్రీహంసితను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్ : జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో జరిగిన క్లస్టర్, రీజియన్ పోటీల్లో సత్తా చాటిన జిల్లాకు చెందిన జి.శ్రీహంసిత జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైంది. సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న శ్రీహంసిత ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రీజినల్ స్థాయిలో రతజ పతకం దక్కించుకోగా, క్లస్టర్ స్థాయిలో స్వర్ణపతకం సాధించింది. జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, నవోదయ ప్రిన్సిపాల్ నాగభూషణం, పీఈటీ గంగా భవాని, చలపతిరావు, కామేశ్వరి, రామారావు, నాగేశ్వరరావు, కోచ్ ఓలేటి సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకళ్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, నిత్యకల్యాణ వేడుకకు భక్తులు భారీగా హాజరయ్యారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులను ఆటోలో తరలిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: పట్టణంలోని వేంసూరు రోడ్డులో ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఆదివారం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కె.అజయ్, నాగమణి, సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని దిగి క్షతగాత్రులను హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అజయ్, నాగమణి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సాయం చేయండి..

- జేఈఈ మెయిన్స్ ర్యాంకర్ వేడుకోలు

ఖమ్మంరూరల్: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. తల్లిదండ్రులు ఇద్దరూ కూలీ పనులు చేస్తేనే పూట గడిచేది. వారి పిల్లలు మాత్రం చదువులో విశేషంగా రాణిస్తున్నారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నంద్ర సాయికార్తీక్ సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఇంటర్మీడియేట్ వరకు విద్యాభ్యాసం చేసినా ఆపై చదువులకు ఆర్థిక స్తోమత లేకపోవడం ఆటంకంగా మారింది. ఎంతో శ్రద్ధతో శ్రమించి జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన సాయికార్తీక్ పైచదువులకు ఫీజులు కట్టే పరిస్థితిలేక ఇబ్బంది పడుతున్నాడు. దాతలు సహకరిస్తే తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ నెల18వ తేదీ లోగా రూ.1.36 లక్షలు చెల్లిస్తేనే ఈ ఆల్ ఇండియా ర్యాంకర్‌కు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చోటు దక్కుతుంది. ఇదిలాఉండగా సాయికార్తీక్ సోదరుడు సాయికిరణ్ కూడా ఎంతో కష్టపడి నీట్‌లో బెస్ట్ ర్యాంక్ సాధించాడు. ఎలాగోలా అతను వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో ఫ్రీగా మెడిసిన్ చదువుతున్నాడు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

మధిర: మండలంలోని మాటూరుపేట గ్రామంలో పిచ్చికుక్క ముగ్గురిపై దాడి చేసి గాయపరిచింది. గ్రామానికి చెందిన యువకులు చిలువేరు అజయ్‌కుమార్, సాదం రామకృష్ణ, తోట వెంకటేశ్వర్లును ఆదివారం పిచ్చికుక్క కరిచింది. గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పిచ్చికుక్కను చంపేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీధికుక్క దాడిలో బాలుడికి..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జలగంనగర్‌లో వీధి కుక్క దాడిలో ఓ బాలుడికి గాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. జలగం నగర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు అభినవ్ ఆరుబయట ఆడుకుంటుండగా వీధికుక్క దాడి చేసి గాయపర్చింది. దీంతో అభినవ్‌కు గాయాలు కావటంతో స్థానికులు, తల్లిదండ్రులు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం చోరీ

సత్తుపల్లి: ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన సత్తుపల్లిలో చోటు చేసుకుంది. పట్టణంలోని మసీద్‌రోడ్‌కు చెందిన జాకీర్‌కు చెందిన టీఎస్ 04 2ఈసీ 8518 నంబరు గల ద్విచక్రవాహనం శనివారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశారు. ఆదివారం ఉదయం లేచి చూడగా తన ద్విచక్రవాహనం అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

పోక్సో కేసు నమోదు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై మామిడి పాపారావు (28) లైంగిక దాడికి యత్నించాడు. స్థానికులు గమనించి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడు పాపారావుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు.


12 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు 12 కేజీల గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం రైల్వేస్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆదివారం రైలు నుంచి దిగిన వ్యక్తులు గాంధీచౌక్ ప్రాంతం వైపు వెళ్తున్న సందర్భంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వారిపై అనుమానంతో తనిఖీ చేయగా 12 కేజీల గంజాయి దొరికింది. గంజాయిని సీజ్ చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

అటు వ్యాధి.. ఇటు వేదన

ఎయిడ్స్ బాధితులకు పెద్దాస్పత్రిలో డయాలసిస్‌కు నిరాకరణ

- అనుమతి లేదంటున్న కొత్త ఏజన్సీ
- ప్రైవేట్‌కు వెళ్లి అవస్థ పడుతున్న బాధితులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖమ్మానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నా సేవలందక ఇక్కట్లు



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కిడ్నీ వ్యాధి బాధితులకు డయాలసిస్(రక్త శుద్ధి) కేంద్రాల ద్వారా సేవలందుతున్నాయి. ఖమ్మం జిల్లాలో చూస్తే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రితో పాటు సత్తుపల్లి, మమత ఆస్పత్రి, పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్కువ బెడ్లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడేళ్లుగా నెఫ్రోప్లస్ అనే ఏజన్సీకి ఇక్కడ డయాలసిస్ నిర్వహించే బాధ్యతలు అప్పగించారు. ఇటీవలే ఒప్పందం ముగియడంతో దీప్‌చంద్ డయాలసిస్ సెంటర్(డీసీడీసీ) ఈ ఏడాది జూన్‌లో ఐదేళ్ల పాటు బాధ్యతలు దక్కించుకుంది. సదరు సంస్థ ఉద్యోగులతోనే ఆరోగ్యశ్రీ ద్వారా ఇక్కడ కిడ్నీ బాధితులకు డయాలసిస్ నిర్వహిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా కిడ్నీ వ్యాధితో బాధపడే ఎయిడ్స్ రోగులకు డయాలసిస్ చేసేందుకు సదరు ఏజన్సీ ఉద్యోగులు అంగీకరించడం లేదు. ఈ విషయమై పలువురు ఆర్ఎంఓకు ఫిర్యాదు కూడా చేసినా ఫలితం లేకుండా పోయింది. ఒప్పందం సమయంలో ఎయిడ్స్ బాధితులకు డయాలసిస్ చేయాలనే అంశం లేదని చెబుతున్నారు. దీంతో సమస్యను బయటకు చెప్పుకోలేక... ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డయాలసిస్ చేయించుకోలేక అవస్థ పడుతున్నారు.

పెద్దాస్పత్రిలో 22 బెడ్లు..

ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్కువ బెడ్లలో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఇక్కడ 24 గంటల పాటు నిరంతరాయంగా డయాలసిస్ చేస్తారు. సెంటర్‌లో 22 బెడ్లు ఉండగా అందులో నెగెటివ్ పేషెంట్లకు 15 బెడ్లు, హెచ్‌సీవీ పేషెంట్లకు నాలుగు, హెచ్‌బీఎస్ ఒకటి, ఐసీయూ రెండు బెడ్లు కేటాయించారు. ముందస్తుగా రిజిస్టర్ చేయించుకున్న వారికి షెడ్యూల్ ప్రకారం డయాలసిస్ చేస్తుంటారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి బాధితులు నెలలో కొందరు ఒకసారి, ఇంకొకరు రెండు, మూడు సార్లు వస్తారు. మొత్తంగా నాలుగు షిఫ్ట్‌ల్లో రోజుకు 60 నుంచి 70 వరకు డయాలసిస్ సేవలందుతాయి. అయితే, ఇటీవల బాధ్యతలు దక్కించుకున్న ఏజెన్సీ.. కొత్త యంత్రాలు, ఏసీలతో డయాలసిస్ చేస్తున్నా ఎయిడ్స్ బాధితులను అనుమతించకపోవడంతో వివాదం నెలకొంది. మిగతా జిల్లాలో ఎయిడ్స్ బాధితులకు డయాలసిస్ చేస్తున్నా ఇక్కడ ఎందుకు చేయడం లేదనే ప్రశ్న వస్తోంది.

కలెక్టర్ ఆదేశించినా పట్టింపు కరువు..

ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో ఎయిడ్స్ బాధితులు డయాలసిస్ చేయించుకునేందుకు వెళ్తే పట్టించుకోకపోవటంతో కొందరు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించినా తమ పరిధిలోనిది కాదని, నిర్ణయం ఏజన్సీ పెద్దలు తీసుకోవాలని తిప్పిపంపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 16,307 మంది ఎయిడ్స్ బాధితులు ఉండగా వీరిలో 6,160 మంది నిత్యం మందులు వాడుతున్నారు. కాగా, వీరిలో పలువురు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో నెలలో రెండు, మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. కానీ పెద్దాస్పత్రిలో నిరాకరిస్తున్న నేపథ్యాన ఏంచేయాలో పాలు పోక కొందరు ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. మిగతా మరింత అనారోగ్యం పాలవుతున్నా నేపథ్యాన ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

నిర్ణయం మా పరిధిలో లేదు..



ఎయిడ్స్ బాధితులకు డయాలసిస్ చేయడం మా పరిధిలో లేదు. నిర్ణయాన్ని ఏజన్సీ పెద్దలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎయిడ్స్ ఉండి కిడ్నీ సమస్య ఉన్న వారికి డయాలసిస్ చేసేందుకు యంత్రం కూడా ఉంది. పైనుంచి ఆదేశాలు వస్తే చేయడాన్ని సిద్ధంగా ఉన్నాం. ఈ విషయాన్ని ఆస్పత్రి అధికారులకు కూడా తెలియజేశాం. ప్రస్తుతం సాధారణ పేషంట్లకు నిరంతరాయంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నాం.

– జి.రవి, మేనేజర్, డయాలసిస్ సెంటర్

నిర్బంధ సర్వే సిగ్గుచేటు

- నాగపూర్ – అమరావతి నేషనల్ హైవే అలైన్మెంట్ మార్చాల్సిందే
- భూ నిర్వాసిత సమస్యలపై 16న కలెక్టరేట్ ముట్టడిస్తాం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల వెల్లడి



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఖమ్మంమయూరిసెంటర్ : నాగపూర్ – అమరావతి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే కోసం రైతులను నిర్బంధించి బలవంతంగా భూసేకరణ చేపట్టడం సిగ్గుచేటని అఖిలపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. ఈ హైవే నిర్మాణంతో జిల్లాకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. ఖమ్మం సుందరయ్య భవనంలో ఆదివారం అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఎం జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి, అలైన్మెంట్ మార్పు కోసం కృషి చేయాలని కోరారు. నిర్వాసితుల నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ, అలైన్మెంట్ మార్పు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 16న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వ నిర్బంధకాండ చూస్తుంటే రైతులను ఉగ్రవాదుల్లా భావించినట్టుగా అర్థమవుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలు, కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసమే నాగపూర్ – అమరావతి రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. కొదుమూరు, వందనం గ్రామాల్లో కూడా గతంలో నిర్బంధ సర్వే విధానాన్ని అమలు చేశారని వారు గుర్తుచేశారు. రూ.కోట్ల విలువ చేసే భూములకు రూ.లక్షల్లో పరిహారం ఇస్తున్నామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్ గౌడ్, టీడీపీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఖాసింతో పాటు నాయకులు కొండపర్తి గోవిందరావు, మాదినేని రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, మెరుగు సత్యనారాయణ, ఎస్‌కె జానీమియా, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్లు, తాటి నిర్మల, రామాంజనేయులు, యర్రా శ్రీనివాస్, ఎస్.నవీన్ రెడ్డి, తక్కెలపాటి భద్రయ్య, వేములపల్లి సుధీర్, వేముల సతీష్, మందన రవీందర్, నాగండ్ల శ్రీధర్, వెంకటయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగు వివాదం



గిరిజనులను అడ్డుకుంటున్న అటవీశాఖాధికారులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడు గిరిజనులు పోడు భూముల్లో సాగు చేసేందుకు వెళ్లగా అటవీశాఖాధికారులు అడ్డుకోవటంతో ఆదివారం వివాదం నెలకొంది. అటవీశాఖాధికారులు, ఆదివాసీ గిరిజనుల మధ్య వాదోపవాదాలు జరగటంతో ఉద్రిక్తత నెలకొంది. స్థానిక తామరచెరువు శివారులోని అటవీ భూమిలో సాగు చేసేందుకు సుమారు 60 మంది ఆదివాసీ గిరిజనులు వెళ్లగా ఖమ్మం అటవీశాఖ స్క్వాడ్ అధికారులు, స్థానిక అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న 45 ఎకరాలకే ప్రభుత్వం పట్టాలిచ్చిందని, ఇంకా 25 ఎకరాల పోడు భూమికి సర్వే చేసినప్పటికీ పట్టాలివ్వలేదని గిరిజనులు వాపోయారు. ఏటా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వక పోగా అటవీశాఖాధికారులు అడ్డుకోవటం ఏమిటని ప్రశ్నించారు. పట్టాలిస్తామని కొందరు అటవీశాఖాధికారులు డబ్బులు తీసుకొని మోసం చేశారని ఆదివాసీ గిరిజనులు ఆరోపించారు. ఖమ్మం స్క్వాడ్ డీఆర్‌ఓ రవికుమార్ మాట్లాడుతూ.. అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగు చేసుకుంటున్న వారికే పట్టాలిచ్చారని స్పష్టం చేశారు. సాగులో లేనందువల్లే పట్టాలివ్వలేదని పేర్కొన్నారు. సర్వే చేసిన జాబితా ఉందని, పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు కిశోర్‌కుమార్, మంగారావు, నర్సింహ, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సమైక్య ఉద్యమాలే పరిష్కార మార్గం



మాట్లాడుతున్న మనోహర్‌రాజు

ఖమ్మంసహకారనగర్: సమైక్య ఉద్యమాల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని టీపీటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు అన్నారు. నగరంలో ఆదివారం నిర్వహించిన గాంధీనగర్ పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్‌కుమార్ సంతాపసభలో చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మనోహర్‌రాజు మాట్లాడుతూ.. సమైక్య ఉద్యమాలు లేకపోవడం వల్లనే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావాల్సిన పీఆర్‌సీ, ఐఆర్, ప్రమోషన్లు, బదిలీలు, సీపీఎస్ విధానం రద్దు, మొదట తేదీన జీతాలు రాకపోవడం, డీఏలు విడుదల చేయకపోవడం జరుగుతోందన్నారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుకు సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. నగర కార్యదర్శి భాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు దేవరకొండ సైదులు, వై.వెంకటేశ్వరరావు ఎన్.వెంకటేశ్వరరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, రుక్మానందరావు, సుధాకర్, జగదీశ్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయినవారి వివరాల నమోదు

గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక బృందాల ఆరా



చెరువుమాధారంలో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్

నేలకొండపల్లి: తల్లిదండ్రులు లేకుండా అమ్మమ్మ.. నానమ్మ.. తాతయ్య, ఇతర బంధువులు, సంరక్షకుల వద్ద పెరుగుతున్న చిన్నారులు, యువత వివరాలను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సర్వే కార్యక్రమం చేపట్టింది. జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్, ఏఎన్ఎంలు ఉండగా వారంతా కలిసి ఇంటింటికీ వెళ్లి 0–23 ఏళ్ల మధ్య వయసు ఉండి తల్లిదండ్రులను కోల్పోయిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 15లోగా సర్వే నిర్వహించి వారి వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంది. కరోనా సమయంలో అనేక కుటుంబాల్లో దంపతులు మరణించారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి సంతానాన్ని బంధువులు పెంచుతున్నారు. వారి జీవన స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు వారి వివరాలను నమోదు చేయడం వల్ల వారి సంరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించటానికి అవకాశం ఉంటుందని సమాచారం. ప్రభుత్వం అందించిన ప్రత్యేక ఫార్మాట్‌లో తల్లిదండ్రులు లేని వారి వివరాలను నమోదు చేయటంతో పాటు మొబైల్ యాప్‌లోనూ వివరాలు నమోదు చేస్తున్నారు. చేరదీసిన వారి వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, రాయితీలు, ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు, వారికి చేయూత అందించేందుకు సర్వే చేస్తున్నట్లు సమాచారం.

బోదకాలు వ్యాధికి మందులు పంపిణీ



రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ అధికారి

మధిర/ఎర్రుపాలెం : మండలంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆదివారం ఇంటింటికీ తిరిగి బోదకాలు వ్యాధికి మాత్రలను పంపిణీ చేశారు. మడుపల్లిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని డబ్ల్యూహెచ్‌ఓ బృందం అధికారి డాక్టర్ రాజేంద్రకుమార్‌సింగ్, దెందుకూరు, బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. 10 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరికీ ఈ మాత్రలు అందేవిధంగా చూడాలని ఆదేశించారు. రికార్డులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు పృథ్వీనాయక్, ఆరోగ్య సిబ్బంది లంకా కొండయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం ఆర్గనైజేషన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ (జేఏసీ) ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం వీడీవోస్‌కాలనీలోని బీసీ జేఏసీ మీటింగ్‌హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఎండీ జమీల్, ఖమ్మం జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ రెహమాన్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కోఆర్డినేటర్లుగా ఎండీ ముదాసిర్‌అలీ, ఎంఏ గఫార్, కోకన్వీనర్లుగా ఎండీ జమాలుద్దీన్, సయ్యద్ రఫీ, షేక్ మస్తాన్‌బీ, గౌరవ సలహాదారులుగా యూసుఫ్, ఖజామొహినుద్దీన్, డాక్టర్ ఖిజార్, అబ్దుల్ అజీజ్, ఎంఏ నయీం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ అఫ్జల్, మన్సూర్ అలీ, అర్షద్, సలీం, నజీమా, అబ్దుల్ రవూఫ్, డాక్టర్ ఎండీ సాద్, అహ్మద్ పాషా, రేష్మా, కరీమా బేగం, సయ్యద్ సుజా, రఫీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కుటుంబంపై మూకుమ్మడి దాడి

నలుగురికి తీవ్ర గాయాలు




గాయపడిన నాగేశ్వరరావు

నేలకొండపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ ఇంటిపై మూకుమ్మడి దాడి చేసి నలుగురిని గాయపరిచిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన కొక్కిరేణి పృథ్వీ, అతడి భార్య మధ్య మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. పలుమార్లు పెద్దలు పంచాయితీ కూడా చేశారు. ఈ క్రమంలో పృథ్వీ భార్య తరపు బంధువులు పది మంది వచ్చి పృథ్వీ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఇంట్లో ఉన్న పృథ్వీ తండ్రి నాగేశ్వరరావు, తల్లి నాగమణి, బంధువు మహాలక్ష్మితో పాటు పృథ్వీపై దాడి చేయగా వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. కాగా, ఆయుధాలతో దాడి చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుల మధ్య ఘర్షణ

బీరు బాటిల్‌తో ఒకరిపై దాడి



ఆస్పత్రిలో తలకు కట్టుతో రాము

నేలకొండపల్లి: మద్యం మత్తులో యువకులు ఘర్షణకు దిగారు. బీరు బాటిల్‌తో ఒకరి తల పగలగొట్టారు. ఈ ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలో జరుగుతున్న కోదాడ – కురవి జాతీయ రహదారి పనులు చేసేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి కొంత మంది యువకులు కూలి పనుల కోసం వచ్చారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో మద్యం దుకాణం వద్ద కొంతదరు కూలీలు మద్యం తీసుకుని పనులు చేసే ప్రాంతం వైపు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తున్న సమయంలో యువకులు మద్యం మత్తులో ఘర్షణకు దిగారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాము తలపై మరొకరు బీరు బాటిల్‌తో కొట్టగా తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. వెంటనే అతడిని సహచర కూలీలు నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. కాగా, ఈ ఘటనపై యువకుల మధ్య భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తనకు తానే బీరు బాటిల్‌తో తలపై కొట్టుకున్నట్లు కొంతమంది చెబుతున్నారు. కారణం మాత్రం చెప్పటం లేదు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కనపర్తి రాము (ఫైల్)

మధిర: తన ఆటోను ఫైనాన్స్ కంపెనీ బాధ్యులు తీసుకువెళ్లడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని మహాదేవపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కనపర్తి రాము (22) ఫైనాన్స్ కంపెనీలో ఆటో కొని మహాదేవపురం నుంచి మధిర నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి సుమారు 2 నెలల కిందట వివాహమైంది. ఆటో సరిగా నడవకపోవడం, ఫైనాన్స్ కంపెనీ కిస్తీలు చెల్లించకపోవడంతో వారు ఆటోను తీసుకువెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన రాము ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి బయట ఉన్న దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

మధిర: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మధిర పట్టణంలో చోటుచేసుకుంది. ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామానికి చెందిన యరమల కృష్ణారెడ్డి (45) కుటుంబం సుమారు ఆరు నెలలుగా తన అత్తగారు ఉంటున్న మధిరకు వచ్చి నివసిస్తున్నారు. కృష్ణారెడ్డి కూలి పనులకు వెళ్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. కూలి పనులకూ వెళ్లలేకపోవడంతో మనస్తాపానికి గురై మానసిక స్థితి దెబ్బతింది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా కృష్ణారెడ్డి కనిపించ లేదు. పక్క గదిలోకి వెళ్లి పరిశీలించగా గదిలో అడ్డంగా వేసి ఉన్న ఇనుపరాడ్‌కు తాడుతో ఉరి పెట్టుకొని మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ముదిగొండ: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని పండ్రేగుపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పండ్రేగుపల్లికి చెందిన వివాహిత దండా హర్షిత (29) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది పురుగులమందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. మృతురాలి తండ్రి వీరబాబు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



స్వరూప మృతదేహం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన స్వరూప (35) కొంతకాలంగా మండల కేంద్రంలో అద్దెకు ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఆమె చీరతో ఉరివేసుకుని ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. అయితే, మహిళ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని స్థానిక పోలీసులు సందర్శించారు.



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు.

ఫీజు విషయంలో గొడవ లాయర్ దాడిలో క్లయింట్ మృతి

బాన్సువాడ రూరల్ : న్యాయసలహా కోసం వెళ్లిన క్లయింట్‌తో కలిసి మద్యం తాగిన ఓ లాయర్ ఫీజు విషయంలో ఘర్షణపడి దాడిచేయడంతో క్లయింట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడకు చెందిన షేక్ అహ్మద్ (45) ఆర్బాత్ కాలనీలో తన ఇంటిపై పై అంతస్తు నిర్మించేందుకు సాజిల్ అనే వ్యక్తికి రూ.18 లక్షలకు కాంట్రాక్టుకు ఇచ్చాడు. ఇందులో రూ.17 లక్షలు చెల్లించినా పనిమాత్రం ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ తప్పించుకు తిరుగుతుండటంతో అతనిపై చట్టరీత్యా చర్యల కోసం షేక్ అహ్మద్ శనివారం సాయంత్రం పట్టణానికి చెందిన ఉబేద్ అనే లాయర్ వద్దకు న్యాయసలహా కోసం వెళ్లాడు.

వాటర్ ప్లాంట్‌లో మద్యం తాగుతూ...

లాయర్‌కు చెందిన వాటర్ ప్లాంట్‌లోనే ఉబేద్, క్లయింట్ షేక్ అహ్మద్, ఆ ప్లాంట్‌లో పనిచేసే మహమూద్, మరోవ్యక్తి అలీం కలిసి మద్యం తాగుతూ కేసు విషయమై చర్చిస్తుండగా లాయర్ ఫీజు విషయంలో గొడవ ప్రారంభమైంది. గొడవలో ఉబేద్, షేక్ అహ్మద్‌ను కిందికి తోసి తలపై కర్ర విసిరి, బండరాయితో తలపై కొట్టడంతో రక్తపుమడుగులో పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు షేక్ అహ్మద్‌ను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ షేక్ అహ్మద్ ఆదివారం ప్రైవేటు న్యూరో ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు షేక్ మహమూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

భారీగా విద్యుత్ డిమాండ్

వర్షాభావంతో పెరిగిన ఉచిత విద్యుత్ వినియోగం • వేసవిని తలపిస్తున్న కరెంట్ వాడకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అనూహ్యంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. ఆగస్టు మొదటివారం నుంచి మళ్లీ వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండడమే ఇందుకు కారణం. రాష్ట్రంలోని 31లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వర్షాలు లేక బోరుబావుల కింద ఉచిత విద్యుత్ బాగా వాడేస్తున్నారు. పంటలను రక్షించుకోవడానికి రైతులు పెద్దఎత్తున విద్యుత్ వినియోగిస్తున్నారు. దీంతో గతవారం రోజులుగా రాష్ట్రంలో రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 13వేల మెగావాట్లకు మించిపోయింది. ఈ నెల 11న అత్యధికంగా 13,829 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. అదేరోజు జాతీయస్థాయిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,28,963 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు నెలకొల్పింది. సాధారణంగా వేసవిలో డిమాండ్ ఈ స్థాయిలో పెరుగుతూ ఉంటుంది. గత నెలాఖరులో ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురవడంతో అప్పట్లో రోజువారీగా రాష్ట్రస్థాయిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 8వేల మెగావాట్లలోపు మాత్రమే నమోదైంది. గత నెల 27న అయితే గరిష్ట డిమాండ్ ఏకంగా 6904 మెగావాట్లకు పడిపోయింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ త్వరలో 14వేల మెగావాట్లకు చేరే అవకాశాలున్నాయని ట్రాన్స్‌కో యాజమాన్యం అంచనా వేస్తోంది.



విద్యుత్ వినియోగం ఇలా (మెగావాట్లలో)	
జూలై 27న	6904
ఆగస్టు 11న	13,829

జల విద్యుదుత్పత్తిపై కరువు నీడలు

కృష్ణా బేసిన్‌లో తీవ్ర వర్షాభావం కారణంగా ఈ ఏడాది శ్రీశైలం, నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ప్రశ్నార్థకంగా మారింది. కనీసం 3000 మిలియన్ యూనిట్ల(ఎంయూ) జల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రతి ఏటా తెలంగాణ జెన్‌కో లక్ష్యంగా పెట్టుకుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 1000 ఎంయూలు కూడా ఉత్పత్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు. శ్రీశైలం, సాగర్ జలాశయాలు ఈ ఏడాది పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి లేదు. ఇంకా శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే 97 టీఎంసీలు, నాగార్జునసాగర్ నిండాలంటే 166 టీఎంసీల వరద ఎగువ నుంచి రావాలి. ఆదివారం నాటికి శ్రీశైలం జలాశయానికి కృష్ణానది ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది.

రోజూ రూ.30 కోట్ల విద్యుత్ కొనుగోళ్లు

ప్రస్తుతం జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం లేకపోవడంతో గరిష్ట డిమాండ్ నెలకొని ఉండే వేళల్లో నిరంతర విద్యుత్ కొనసాగించడానికి పవర్ ఎక్స్ఛేంజీల నుంచి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు పెద్దఎత్తున విద్యుత్ కొనుగోళ్లు చేస్తున్నాయి. రోజూ రూ.30 కోట్ల వ్యయంతో 60 ఎంయూల విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న డిస్కంలకు రోజువారీ విద్యుత్ కొనుగోళ్లు తీవ్ర భారంగా మారాయి.

తిరుమల కాలినడక..ఘాట్ మార్గాల్లో ఆంక్షలు

► మొదటి పేజీ తరువాయి

కాలినడక మార్గంలో అనుమతిస్తారు. శ్రీవారి మెట్టు వైపు కాలినడక మార్గంలో మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే 15 సంవత్సరాలలోపు చిన్నారులను తల్లిదండ్రులు, బంధువులతో అనుమతిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెద్దలను మాత్రమే ఈ మార్గంలో అనుమతిస్తారు. శనివారం నుంచి రెండు ఘాట్ రోడ్లలో సాయంత్రం 6 గంటల తరువాత ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే.

చిన్నారుల రక్షణకు ట్యాగ్‌లు

అలిపిరి నుంచి తిరుమల నడకదారిలోని అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం పెరగడం, దాడుల నేపథ్యంలో పోలీసులు రక్షణ చర్యలను చేపట్టారు. ఆదివారం నుంచి అలిపిరి నడక మార్గంలోని ఏడో మైలు వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు ట్యాగ్‌లు వేస్తున్నారు. ట్యాగ్‌లు వేయడం వల్ల తల్లిదండ్రుల నుంచి పిల్లలు తప్పిపోయి నా సులభంగా కనిపెట్టేందుకు వీలవుతుంది. ట్యాగ్ పై చిన్నారి పేరు, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్, పోలీస్ టోల్‌ఫ్రీ నంబర్ నమోదు చేసి ఉంటాయి.

ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం

నడక మార్గం, ఘాట్ రోడ్లలో ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ చిరుతలు పెరిగినట్టు అటవీ అధికారులకు సమాచారం అందుతోంది. శనివారం కూడా నడక మార్గం, ఘాట్ రోడ్లలోని చిరుతల సంచారం గుర్తించారు. అలిపిరి నుంచి గాలిగోపురం వరకు మూడు ప్రాంతాలు, గాలి గోపురం నుంచి ఏడో మైలు వద్ద చిరుత సంచారాన్ని గుర్తించారు. రెండో ఘాట్ రోడ్డులోని 38 మలుపు చిరుత తిరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో భక్తులను అప్రమత్తం చేశారు.

ఆపదను తప్పించే 'ఆలోచన'


తిరుమల అలిపిరి నడక మార్గంలో ఓ భక్తుడు ఆదివారం అందరినీ ఆకట్టుకున్నాడు. నడక మార్గంలో వన్య ప్రాణులు సంచరిస్తోన్న నేపథ్యంలో విజయవాడకు చెందిన ఓ భక్తుడు తన కుమారుడి చేతికి రబ్బర్ ఎలాస్టిక్ తాడు తగిలించి..ఆ తాడును ఆయన చేతికి ఇలా కట్టుకున్నాడు. దీనిపై ఆ భక్తుడిని ప్రశ్నించగా తమ జాగ్రత్త కోసమే తాడు కట్టినట్లు చెప్పాడు.
– తిరుమల



'వైద్యం'లో తెలంగాణ నంబర్ వన్

- కేసీఆర్ హయాంలో ఎంతో ప్రగతి
- ప్రభుత్వ వైద్యులకు పీజీలో రిజర్వేషన్లు కల్పిస్తాం
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): వైద్యం, వైద్య విద్యలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్యలో రాష్ట్రం ఎంతో వెనుకబడి ఉండేదని, నిజామ్, బ్రిటిషర్లు ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులే ఉండేవని గుర్తుచేశారు. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో వైద్యరంగంలో ఎంతో ప్రగతి సాధించామని చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ఆదివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి జిల్లాకు ఓ వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని హరీశ్ అన్నారు. లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నామని, అలాగే పీజీలో 8 సీట్లతో రెండవ స్థానంలో ఉన్నామని తెలిపారు. ధాన్యం ఉత్పత్తితో పాటు వైద్యులను తయారు చేయడంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. ఎంబీబీఎస్ ఫీజులు రాష్ట్రంలోనే తక్కువని, వైద్య విద్యార్థులకు అందించే స్టైఫండ్ అన్ని రాష్ట్రాలకంటే ఇక్కడే ఎక్కువ అని చెప్పారు. ప్రభుత్వ వైద్యులకు పీజీలో రిజర్వేషన్ సదుపాయం కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. నగరం నలుదిక్కుల నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్ గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారిందని, ఇతర దేశాలకు చెందినవారంతా వైద్యసేవలు, చికిత్సల కోసం హైదరాబాద్‌కు క్యూ కడుతున్నారని తెలిపారు. త్వరలోనే గాంధీ ఆస్పత్రిలో అవయవ మార్పిడి, ఫెర్టిలిటీ, ఎంసీహెచ్ భవనాలు, అధునాతన ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు, సదుపాయాలు కల్పించామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందజేశారు. డీఎంఈ రమేష్ రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, పలువురు హెచ్‌ఓడీలు, ఆర్‌ఎంఓలు, వైద్యులు, వైద్యవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్

పర్యావరణ విధ్వంసంతోనే వాతావరణ మార్పులు

ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పర్యావరణ విధ్వంసం కారణంగానే వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా అతి తక్కువ సమయంలో భారీ వర్షాలు, తీవ్రమైన తుపానులు వంటి వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటి నుంచి రేయింబవళ్లు యుద్ధప్రాతిపదికన శ్రమిస్తే తప్ప పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చలేని పరిస్థితి ఉందని... తక్షణమే శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం పెరగాలని పురుషోత్తమ్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఢిల్లీలోని ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేపిటల్ ఫౌండేషన్ సంస్థ ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్‌ను అందించింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్ డా. సీవీ ఆనందబోస్ చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, జస్టిస్ ఏకే పట్నాయక్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డితో పాటు సామాజికంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురికి అవార్డులు అందించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణం, సుస్థిరాభివృద్ధి రంగంలో గత 50 ఏళ్లుగా తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. మన దేశంలో పర్యావరణ చట్టాలు బాగున్నప్పటికీ... వాటి అమలు మాత్రం సరిగా జరగడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక యంత్రాంగాలను నిర్వీర్యం చేస్తున్నాయని.. ఇసుక వంటి ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టాల్సింది స్థానిక యంత్రాంగాలేనని తెలిపారు. భారత్‌లో అంతులేని సౌరశక్తి ఉందని, దానిని ఉపయోగించుకోవడం ద్వారా సంప్రదాయ ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు.



అవార్డు అందుకుంటున్న పురుషోత్తంరెడ్డి

జిల్లా వార్తలు

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ ఎంపికలు ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం జిల్లా క్రీడాకారులు హాజరు కావాలన్నారు. ఎంపికలు ఉదయం 7.30 గంటలకు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాల వెల్లువ



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. భద్రాచలానికి చెందిన పద్మ ఐరన్‌షాపు యజమాని చారుగుళ్ల పద్మ – వెంకటరమణ దంపతులు రూ. 1,01,116, పాల్వంచ పట్టణానికి చెందిన పుట్టంరాజు నరసింహారావు దంపతులు రూ. 1,00,116, హైదరాబాద్‌కు చెందిన గోపరాజు శ్రీనివాసరాజు రూ. 1,01,116 చెక్కులను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది వారికి రశీదుతో పాటు ప్రసాదం, స్వామివారి జ్ఞాపిక అందజేశారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డీర్‌పార్కులోని దుప్పులు, డ్యాంపైనుంచి జలాశయం వీక్షించడంతో పాటు బోటింగ్ చేశారు. 818 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.22,500, 200 మంది బోటింగ్ చేయడం వల్ల టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.12,540 ఆదాయం లభించింది. పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు, ములుగు ఎమ్మెల్యే సీతక్క కుమారుడు సూర్య కిన్నెరసానిని సందర్శించారు.

సారూ.. కనికరించరూ

క్రమబద్ధీకరించాలని హోంగార్డుల వినతి

- ఇటీవల వీఆర్‌ఏలు, వీఆర్‌ఓల పర్మనెంట్
- తాజాగా ప్రభుత్వంలోకి ఆర్టీసీ ఉద్యోగులు
- తమనూ పరిగణనలోకి తీసుకోవాలని వేడుకోలు



పరేడ్ చేస్తున్న హోంగార్డులు (ఫైల్)

కొత్తగూడెంటౌన్: పోలీసు శాఖలో ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు తమ సర్వీసును ప్రభుత్వం క్రమబద్ధీకరించకపోతుందా అని ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసింది. అలాగే, వీఆర్‌ఏలు, వీఆర్‌ఓల సర్వీసును కూడా క్రమబద్ధీకరించిన నేపథ్యాన ప్రభుత్వం తమపై కూడా దృష్టి సారించాలని హోంగార్డులు వేడుకుంటున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక వేతనాలు పెంచిన ప్రభుత్వం.. ఉద్యోగ భద్రత కూడా కల్పిస్తే తమ కుటుంబాలను ఆదుకున్నట్లు అవుతుందని వారు విన్నవిస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,162 మంది..

ప్రస్తుత సమాజంలో హోంగార్డులంటే తెలియని వారుండరు. పోలీసుస్టేషన్లలో విధులే కాక శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తులో పోలీసు ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 700 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 462 మంది ఉన్నారు. వీరిలో చాలా మంది 20, 25 ఏళ్లుగా పనిచేస్తూ ఎప్పటికైనా ఉద్యోగం పర్మనెంట్ కాకపోతుందా అనే ఆశతో ఉన్నారు. హోంగార్డులు పోలీసులకు సపోర్టింగ్ స్టాఫ్‌గా లా అండ్ ఆర్డర్, బందోబస్తు, పెట్రోలింగ్, ట్రాఫిక్ డ్యూటీలే కాక రాజకీయ నాయకులకు భద్రత, పోలీసు స్టేషన్లలో డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

1963లో ఏర్పాటు

సాధారణంగా సైన్యాల పోరాటం సమయాన స్థానికులు, గృహాల రక్షణ కోసం ఏర్పడే దళ సభ్యులను హోంగార్డులుగా పిలిచేవారు. మొదటగా 1850లో హోంగార్డు అనే పదం వాడుకలోకి వచ్చింది. భారత ప్రభుత్వం మార్చి 1959లో స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 1963లో పోలీసులకు సహాయకులుగా వ్యవహరించేందుకు హోంగార్డు వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చారు. మొదట్లో ప్రభుత్వ సేవకుల నుంచి హోంగార్డులను తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ తరువాత చేరే సదుపాయాన్ని కల్పించారు.

వేతనాలు.. వెతలు

తెలంగాణ ఏర్పడ్డా, హోంగార్డుల వేతనాలు పెంచారు. దీంతో నెల పాటు పనిచేస్తే రూ.24 వేల వరకు అందుతున్నాయి. గతంలో రూ.10 వేలు మాత్రమే వచ్చేవి. అలాగే, ఏటా రూ.1,000 ఇంక్రిమెంట్ సైతం ఇవ్వడమే కాక ప్రభుత్వ తరపున యూనిఫాం అలవెన్స్ అందుతోంది. అయితే, ప్రతిరోజు 8 గంటల పనివేళలు అమలవుతున్నాయి. హోంగార్డులకు ఉద్యోగ భద్రత లేకపోగా సెలవు తీసుకునే అవకాశం ఉండదు. ఒకవేళ పని చేయకపోతే ఆ రోజు వేతనం అందదు. దీంతో అత్యవసర పని ఉంటే జీతం కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కాగా, మహిళా హోంగార్డులకు మాత్రం మెటర్నిటీ సెలవులు ఆరు నెలలు తీసుకునే వెసులుబాటు ఉంది. మిగతా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వం స్పందించి తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించి పే స్కేల్ అమలుచేయాలని హోంగార్డులు కోరుతున్నారు.

ఉమ్మడి పౌరస్మృతి సమైక్యతకు ప్రమాదకరం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఉమ్మడి పౌరస్మృతి దేశ సమైక్యతకు ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇది ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు తప్ప హిందువులకు, గిరిజనులకు, ఆదివాసీలకు, మైనార్టీలకు ఎవరికీ మేలు జరగదని చెప్పారు. మణిపూర్‌లో రెండు నెలలుగా గిరిజన తెగకు చెందిన మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింసాత్మక ఘటనలు జరుగుతున్నా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ పట్టించుకోవడం లేదని, పైగా హింసను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం సిగ్గుచేటని, ఈ ఘటన జరిగి రెండు నెలలు గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరుమెదపడం లేదని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాదం, దుర్గరాశి వెంకటేశ్వర్లు, వై. శ్రీనివాస్‌రెడ్డి, సలిగంటి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, వట్టికొండ మల్లికార్జున్‌రావు, వి. పూర్ణచందర్ రావు, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, కందుల బాస్కర్, మునిగడప వెంకటేశ్వర్లు, వంగా వెంకట్, జి.వీరస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

అకాడమీ ప్రవేశాలకు 17, 18 తేదీల్లో ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్ : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో అకాడమీల ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. వరంగల్‌లోని రీజినల్ హాస్టల్ అథ్లెటిక్స్‌లో, సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీల్లో, ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీలో, సరూర్‌నగర్‌లో వాలీబాల్ అకాడమీలో, వనపర్తిలో హాకీ పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు వివరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వాలీబాల్ అకాడమీకి ఈనెల 19, 20 తేదీల్లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. 13–16 ఏళ్ల వయసు గల వారు మాత్రమే అర్హులని, వరంగల్‌లోని రీజినల్ హాస్టల్‌లో చేరేవారు పదేళ్ల వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఖమ్మం అకాడమీలో 15 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు సంబంధిత సర్టిఫికెట్లతో పైన పేర్కొన్న తేదీల్లో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. టీఏ, డీఏ ఇవ్వరని స్పష్టం చేశారు.

సూపర్‌లగ్జరీ బస్సుల్లో వాటర్ బాటిల్

టికెట్‌పై రూ.10 అదనం

ఖమ్మం మామిళ్లగూడెం : ప్రయాణికులకు సౌకర్యంతో పాటు సంస్థకు ఆదాయం పెంచుకోవడానికి టీఎస్‌ఆర్టీసీ మరో అడుగు ముందుకు వేసింది. సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించేవారికి జీవా వాటర్ బాటిల్ అందిస్తూ టికెట్ ధరపై రూ.10 అదనంగా వసూలు చేస్తోంది. ఖమ్మం బస్టాండ్‌లో ఈ కార్యక్రమాన్ని డీఎం శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర, మణుగూరు, భద్రాచలం డిపోలు ఉన్నాయి. భద్రాచలం డిపోలో 24 సూపర్ లగ్జరీ బస్సులు, సత్తుపల్లిలో 19, మణుగూరులో 12, ఖమ్మంలో 8, కొత్తగూడెంలో 17, మధిరలో 10, మణుగూరు డిపోలో 15.. మొత్తం 105 సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి. ఖమ్మం డిపో నుంచి హైదరాబాద్, కూకట్‌పల్లికి ఎక్కువగా తిప్పుతుండగా విశాఖపట్టణానికి రాత్రి 7 గంటలకు ఒకటి, 9 గంటలకు ఒక బస్సు బయలుదేరుతాయి. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.370 ఉండగా, ప్రస్తుతం రూ.380 చొప్పున, విశాఖపట్టణానికి రూ.760 ఉండగా, ఇప్పుడు రూ.770 చొప్పున వసూలు చేస్తున్నారు.



ప్రయాణికులకు వాటర్ బాటిల్ అందిస్తున్న డీఎం శ్రీనివాస్

భద్రాద్రి రామయ్య ఆదాయం రూ.16 లక్షలు



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆదివారం భారీగా తరలివచ్చిన భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి ఆదివారం సుమారు 9 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయానికి ఒక్కరోజే రూ.16 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 3,61,275, అభిషేకాలు, పూజలు, కల్యాణాల ద్వారా రూ.7,33,096, సత్రాల ద్వారా రూ.73,696, శాశ్వత అన్నదానం ద్వారా రూ.3,02,348, ఆన్‌లైన్ ద్వారా రూ.1,52,028, ఇతర సేవల ద్వారా మొత్తంగా రూ.16, 25,198 ఆదాయం లభించిందని ఆలయ అధికారులు తెలిపారు.

17, 18 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి సదస్సు

ఖమ్మంమయూరిసెంటర్ : పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి సదస్సు(వర్క్‌షాప్) ఈనెల 17, 18 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ తెలిపారు. నగరంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌నకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఎంపికైన నాయకులు, కార్యకర్తలు, యూనివర్సిటీ, పీజీ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వర్క్‌షాప్‌ను ప్రొఫెసర్ హరగోపాల్ ప్రారంభిస్తారని, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు కాశీం, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, విజ్ఞాన దర్శిని రమేష్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం, ఉస్మానియా యూనివర్సిటీ స్కాలర్ ఎస్‌ఏ డేవిడ్ తదితరులు వివిధ అంశాలపై బోధిస్తారని వివరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్, జిల్లా అధ్యక్షుడు క్రాంతి, గోపి, రామకృష్ణ, సాగర్, ప్రభు, సర్వేందర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేష్